# వర్షాధార రైతుల, వ్యవసాయ కూలీల మహిళలకు అదనపు జీవనోపాధుల ప్రోత్సాహక ప్రాజెక్టు 2020-21 పై సిబ్బందికి మార్గదర్శకాలు

## జూన్ - 2020

యాక్షన్ ఫ్రెటార్నా
ఎకాలజీ
సెంటరు
ప్రకృతి • మానవత • సుస్థిరత

**శ్రీమతి అనుపమ నాదెళ్ళ మరియు శ్రీ సత్యనాదెళ్ల వారి**

కుటుంబ ఆర్థిక సహాయముతో...

## ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు

అనంతపురము.

# 1. ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ యొక్క ఆశయం, మరియు లక్ష్యం

## ఎ. ఆశయం :

1. ప్రజలందరూ ఆర్థిక, ఆరోగ్య జీవనోపాధుల భద్రత కలిగి సాంఘిక సమన్యాయం, స్త్రీ, పురుష సమన్యాయం, పరస్పర గౌరవ మర్యాదలతో, సమాజంలో శాంతి ప్రజాస్వామిక వాతావరణంలో పరస్పర సహకారముతో నిర్భయంగా జీవించగలగాలి.
2. అందరూ వ్యక్తులు, వ్యవస్థలు, సంస్థలు భూమాతకు శాశ్విత ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ నిరాడంబరంగా జీవిస్తూ, ప్రకృతి సంరక్షణ ధర్మాన్ని పాటిస్తూ, ప్రజల కోసం ప్రకృతి, ప్రకృతి కోసం ప్రజలనే అవగాహనతో, జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిరమైన పర్యావరణం, జీవావరణం కాపాడబడుతూ ప్రకృతి ఒడిలో ప్రజలందరూ ఆరోగ్యకరంగా జీవించాలి.

## బి. లక్ష్యం :

1. నిస్సహాయులు, నిరుపేద రైతులు, వ్యవసాయ కూలీలను సంఘటితపర్చి, వారితో సంఘాలను, సహకార సంస్థలను స్థాపించి, వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా ఆదాయ భద్రత, పౌష్టికాహార, ఆహారభద్రత, సాధికారత, స్వయం సమృద్ధి సాధించడం ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు యొక్క ముఖ్య లక్ష్యం.
2. కరువు కాటకాలతో సతమతమవుతున్న రైతాంగంతో ముఖ్యంగా సన్న, చిన్నకారు, వర్షాధార రైతులతో కలిసి పనిచేసి, కనీస పెట్టుబడులతో కరువుకు తట్టుకొనే విధంగా పర్యావరణహిత, వాతావరణహిత, సమగ్ర సుస్థిర వ్యవసాయ పద్ధతులను రైతుల భాగస్వామ్యముతో అభివృద్ధి చేసి, వాటిని వ్యాప్తి చేయుటకు ఏ.ఎఫ్ ఎకాలజీ సెంటరు అంకితమైనది.
3. సుస్థిర పర్యావరణం, సమతుల్య జీవావరణం, స్థిర వాతావరణం, జీవవైవిధ్యాల్ని పెంపొదిస్తూ, ఎడారీకరణను నివారిస్తూ, ప్రజలు మరియు ప్రకృతి ఒకరినొకరు గౌరవించి పోషించుకొనే విధంగా సహజీవనం చేయునట్లు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు కృషి చేస్తుంది.
4. నిరుపేదలు, జీవనావకాశాలు లేని మహిళలు, యువత అభివృద్ధి లక్ష్యంగా వారితో కలిసి పనిచేస్తూ, విభిన్న జీవనోపాధుల పెంపుదలలో భాగంగా సహకార సంస్థలను ప్రోత్సహించడం, వ్యవసాయ ఉత్పత్తుల ప్రొసెసింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువలను జోడించడం, మార్కెటింగ్, వ్యవసాయ రంగాలలో ఆధునిక నైపుణ్యాలను అభివృద్ధి పర్చడానికి ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు పనిచేస్తుంది.
5. గ్రామాలలో స్త్రీ - పురుష వివక్షతలు లేని సాంఘిక సమానత్వం, గౌరవప్రదమైన జీవనం పెంపొందించడంతోపాటు, శాంతి ప్రజాస్వామ్యం, పరస్పర సహకారం, సామాజిక అండదండల ఆధారంగా, భాధ్యతాయుత సామాజిక వాతావరణం పెంపొందించేందుకు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు కృషి చేస్తుంది.
6. ప్రభుత్వ సంస్థలతోనూ, భావసారూప్యత కలిగిన ప్రజా సంస్థలతోనూ, స్వచ్ఛంద సంస్థలతోనూ, వ్యక్తులతోనూ, ఏ.ఎఫ్.సంస్థ కలిసి పనిచేస్తుంది. ఇందులో భాగంగా సామాజిక ప్రయోజనం కోసం వివిధ సంస్థలు, మేధావులు, నిపుణులు, వ్యక్తులు చేస్తున్న కృషితో ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు చేయి కలిపి పనిచేస్తుంది.
7. ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు ఒక సమర్థవంతమైన, చలనశీల, శాశ్విత సంస్థగా పనిచేసే లక్ష్యం కలిగి వుంది. నిత్యం అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటూ, నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ వుంటుంది. మారుతున్న పరిస్థితులకు, మారుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా తాను కూడా మారుతూ, సమాజాన్ని ప్రభావితం చేస్తుంది.

# వర్షాధార రైతుల, వ్యవసాయ కూలీల మహిళలకు అదనపు జీవనోపాధుల ప్రోత్సాహక ప్రాజెక్టు

**1. పరిచయము :**

ఈ కార్యక్రమము శ్రీమతి అనుపమ నాదెళ్ల మరియు శ్రీ సత్యనాదెళ్ల వారి కుటుంబ ఆర్థిక సహాయముతో గ్రామీణ మెట్ట రైతు మహిళలు మరియు కూలీ మహిళల ఆర్థిక, సాంఘిక అభివృద్ధి సాధించుటకు ఉద్దేశించబడినది. ఈ ప్రాజెక్టు కోసం వారు రూ. 2 కోట్లు ధన సహాయం మన సంస్థకు అందించడమైనది.

**2. ప్రాజెక్టు ఆశయము మరియు ఉద్దేశ్యములు :**

**1. ఆశయము :**

మహిళలకు ఆర్థిక స్వావలంబన, సామాజికంగా గుర్తింపు, గౌరవం పెంపొందించడము తద్వారా వారి కుటుంబాలకు జీవనోపాధుల భద్రత కల్పించడం ఈ ప్రాజెక్టు ఆశయంగా ఉంది.

**2. ఉద్దేశములు :**

1. సస్యమిత్ర గ్రూపుల ఆధ్వర్యములో మెట్ట రైతు, వ్యవసాయ కూలీ కుటుంబాలలోని 3000 మంది మహిళా సభ్యులకు అదనపు జీవనోపాధులను కల్పించి వారి ఆదాయ అవకాశాలను పెంచడం ద్వారా వారికి జీవనోపాధి భద్రత కల్పించడం ఈ ప్రాజెక్టు మొదటి ఉద్దేశ్యం.
2. ఈ కార్యక్రమము అమలు చేసే ప్రక్రియలో 600 సస్యమిత్ర గ్రూపులను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ రెండవ ఉద్దేశము.

**3. కార్యచరణ ప్రణాళిక :**

**3.1 కార్యక్రమ అమలు కోసం సస్యమిత్ర గ్రూపుల ఎంపిక మరియు గ్రూపులను బలోపేతం చేయడం :**

ప్రస్తుతం వున్న 800 యస్.యం.జి.లను ఏ.బి.సి.డి. గ్రేడులుగా గత సంవత్సరం విభజించి వాటిని బలోపేతం చేస్తున్నాము. గత సంవత్సరము మనము సస్యమిత్ర గ్రూపులను ఏ ప్రాతిపదికన విభజించాలో నిర్ణయించి విభజించడమైనది. ఇప్పుడు ఈ ప్రాజెక్టు అమలుకోసం చిన్న చిన్న సడలింపులతో తిరిగి అదే ప్రాతిపదిక ఆధారంగా విభజించవలసి వుంటుంది. క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, పొదుపు నిర్వహణ, అప్పు నిర్వహణ, పుస్తక నిర్వహణ మరియు గ్రూపు సభ్యుల మధ్య పరస్పర సహకారం వంటి అంశాలను ఆధారంగా 800 యస్.యం.జి.లను ఎ.బి.సి.డిల గ్రేడ్ లుగా విభజించడం జరుగుతుంది.

ఈ కార్యక్రమము ప్రస్తుతము 'A' గ్రేడులో వున్న గ్రూపులతో మొదలు పెట్టవలయును. అదే సమయంలో B,C,D, గ్రేడులలో వున్న గ్రూపులను A గ్రేడులోకి తీసుకొనివచ్చే విధంగా వాటిని బలోపేతం చేసుకుంటూ, ఈ కార్యక్రమాన్ని ఒక క్రమ పద్ధతిలో ఇతర గ్రూపులకు విస్తరించవలయును. కాబట్టి ఈ కార్యక్రమం ఒక అవకాశంగా భావించి, మహిళల అభివృద్ధితో పాటు, బలహీనంగా వున్న సస్యమిత్ర గ్రూపులు వాటి శక్తి సామర్థ్యాలను A గ్రేడు స్థాయికి పెంచుకొనేందుకు మనము కృషి చేయవలసి వుంది. కనీసం 4 నెలల నుండి 6 నెలల పాటు వారు A గ్రూపు స్థాయిలో పని చేసిన తరువాతనే ఈ కార్యక్రమం క్రింద లబ్ధి పొందుటకు ఆ గ్రూపులకు అర్హత వస్తుంది. ప్రస్తుతము ఈ కార్యక్రమాన్ని క్రింది విధంగా మొదలుపెట్టవలయును.

1. సస్యమిత్ర గ్రూపు 'A' గ్రేడ్‌లో ఉన్న వాటిని గుర్తించి వాటితో మొదలు పెట్టవలయును. గత సంవత్సరం మనం చేసిన గ్రేడింగ్ ప్రకారం దాదాపు 300 గ్రూపులు A గ్రేడులో ఉన్నట్లు గ్రేడింగ్‌లో తెలిసింది.
2. మొదటగా A గ్రేడులో వున్న యస్.సి. / యస్.టి. గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరువాత మెట్ట రైతుల బి.సి. గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
3. ఎంపిక చేసిన గ్రూపులు ఈ ప్రాజెక్టు యొక్క నియమ నిబంధనలకు అంగీకరించి, పాటిస్తామని గ్రూపులో తీర్మానము చేయాలి.
4. A గ్రేడులో వున్న గ్రూపులతో పని మొదలు పెట్టి, అదే సమయంలో B,C,D గ్రేడులలో వున్న గ్రూపులతో ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశాలను దీని వలన వారికి చేరే ప్రయోజనాలను చర్చించి వాటిని A గ్రేడు స్థాయికి వచ్చే విధంగా ఫెసిలిటేట్ చేయవలయును. ఇందుకు యస్.టి.ఓ. మరియు యం.టి.ఎల్ బాధ్యత వహించి ఒక నిర్దిష్ట పథకం ప్రకారము వాటిని A గ్రేడుకు వచ్చునట్లు ఫెసిలిటేట్ చేయవలయును.

### 3.2 మహిళా లబ్ధిదారుల ఎంపికకు అర్హతలు, ప్రాధాన్యతలు :

A గ్రేడులో వున్న గ్రూపు నుండి లబ్ధిదారుల ఎంపికలో క్రింది అర్హతలను పాటించవలయును. క్రింది అర్హతలు అన్ని ఏ ఒక్కరికీ ఉండకపోవచ్చు. మొదట తప్పనిసరి అర్హతలున్న వారిని గుర్తించి వారి నుండి మిగిలిన అర్హతలు ఎక్కువగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇచ్చి లబ్ధిదారులను ఎంపిక చేయవలయును. లబ్దిదారుల ఎంపిక సక్రమంగా జరుగునట్లు సంబంధిత యస్.టి.ఓ. ప్రతి గ్రూపును తగిన విధంగా ఫెసిలిటేట్ చేస్తూ నిర్ణయము చేసి తీర్మానము చేయవలయును.

**తప్పనిసరి అర్హతలు :**

1. A గ్రేడ్ గ్రూపులో వున్న సభ్యురాలు కనీసం సంవత్సరకాలంగా గ్రూపులో కొనసాగుతూ వుండాలి. ఇది తప్పనిసరి.
2. పొదుపులు, అప్పులు క్రమం తప్పకుండా చెల్లిస్తూ వుండాలి. ఇది తప్పనిసరి.
3. వ్యాపారం కొరకు ఆర్థిక సహకార దరఖాస్తు చేసే సమయానికి సంబంధిత సభ్యురాలు యస్.యం.జి. గ్రూపులో గత అప్పు నిల్వలు / బకాయిలు వుండరాదు. ఇది తప్పనిసరి.

**ఇతర అర్హతలు :**

4. క్రమం తప్పకుండా సమావేశాలకు కనీసం 60 శాతం హాజరై వుండాలి.
5. దివ్యాంగులైన మహిళలు, లేదా దివ్యాంగులున్న కుటుంబంలోని మహిళలు మరియు ఒంటరి మహిళలు – వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వవలయును.
6. సభ్యురాలికి తాను చేయబోయే ఆదాయ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన ఉండవలయును. అనుభవం కూడా వుంటే మంచిది. ఇప్పటికే కొందరు మహిళలు చాలా చిన్న స్థాయిలో కొన్ని వ్యాపారాలు, వస్తు ఉత్పత్తులు చేస్తున్నారు. వీరికి ఆదాయ మార్గాలను మరింత పెంచుకొనుటకు కూడా ఈ ప్రాజెక్టు క్రింద సహాయము చేయవచ్చును.
7. మహిళలు వివాహితలై 45 సంవత్సరాల లోపు ఉంటే మంచిది. ఇతర అర్హతలు అనుభవం ఉన్న యెడల దీనిని సడలించవచ్చును.
8. కొంత వరకు చదువుకున్న మహిళలను ప్రోత్సహించాలి. చదువుకున్న మహిళలు లేనియెడల సడలింపు వర్తిస్తుంది.
9. లబ్ధిదారుల ఎంపికలో ఒక గ్రామములో లేదా ఒక క్లస్టరులో సమన్యాయం (ఈక్విటీ) క్రింద తెల్పిన విధంగా ప్రాధాన్యతక్రమాన్ని పాటించవలయును. 40 శాతం యస్.సి., 10% యస్.టి. సభ్యులకు, 10% శాతం దివ్యాంగుల కుటుంబాలు, 10% స్త్రీ యాజమాన్య / ఒంటరి మహిళా కుటుంబాల సభ్యులకు (యస్.సి./యస్.టి/బి.సి/ ఓ.సి), 30 శాతం బి.సి. కుటుంబాల వారిని ఎంపిక చేయూలి.

సమన్యాయానికి సంబంధించి, ఎస్.టి.ఓ. తో పాటు ఎమ్.టి.ఎల్ మరియు ప్రాజెక్టు కో ఆర్డినేటరు కూడా బాధ్యత వహించవలయును.

## 3.3. ఎస్.ఎం.జి. గ్రూపులో లబ్ధిదారుల ఎంపిక మరియు తీర్మానము :

1. యస్.యం.జి. మొదటగా ఈ కార్యక్రమం యొక్క నియమ, నిబంధనలకనుగుణంగా అమలు చేయుటకు అంగీకరిస్తూ ఒక తీర్మానము చేయాలి.
2. యస్.యం.జి. సమావేశాలలో కన్వీనరు, కో కన్వీనరు ఆధ్వర్యంలో గ్రూపు సభ్యుల సమక్షంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, తీర్మానం చేయాలి. లబ్ధిదారుల ఎంపికలో అర్హత, ప్రాధాన్యతలను తప్పనిసరిగా పాటించాలి.
3. ఈ తీర్మానములో సభ్యురాలు లబ్ధిదారుగా తీసుకుంటున్న మొత్తాలకు ఉపగ్రూపు సభ్యులందరూ పూచీదారులుగా వుండటానికి సమ్మతించి, సంతకాలు చేయాలి. ఒకవేళ లబ్ధిదారు తీసుకున్న మొత్తము గ్రూపునకు వాపసు కట్టని పక్షంలో పూచీదారులు కట్టవలసి ఉంటుంది.
4. ఒక్కొక్క A గ్రేడు సస్యమిత్ర గ్రూపు నుండి మొదటి సంవత్సర కాలములో గరిష్టంగా అయిదు మంది మహిళా లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ ప్రాజెక్టు క్రింద ధన సహాయము పొందవచ్చును.
5. ధన సహాయం తీసుకొన్న ప్రతి మహిళ సహాయం అందిన మరుసటి నెల నుండి 6 నుండి 10 కంతుల లోపల తీసుకున్న మొత్తము తిరిగి చెల్లించేలా కంతులు నిర్ణయించాలి.

## 3.4 సూక్ష్మ వ్యాపారాలకై ఆర్థిక సహాయం మంజూరు విధానం మరియు ఈ కార్యక్రమము వలన సస్యమిత్ర గ్రూపుకు సమకూరే ప్రయోజనము :

ఈ కార్యక్రమంలో నిర్దేశించిన విధంగా, సస్యమిత్ర గ్రూపు ఎన్నిక చేసిన అయిదు మంది మహిళా సభ్యులకు అదనపు జీవనోపాదులు కల్పించుటకు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు నుండి ఒక సంవత్సర కాలంలో సరాసరి రూ. 31,500/–ల వరకు ఆర్థిక సహాయం లభిస్తుంది. వారు ఆ మొత్తమును వారి గ్రూపునకు కంతులవారీగా తిరిగి కట్టవలసి వుంటుంది. ఆ విధంగా ఆ మొత్తము గ్రూపునకు చెందుతుంది. అయితే ఈ తిరిగి కట్టిన మొత్తమును ఆ గ్రూపు ఆధ్వర్యములో మహిళల అదనపు ఆదాయ కార్యక్రమాల కోసం రివాల్వింగు ఫండుగా మాత్రమే వినియోగించుకోవాలి. ఎలాంటి పరిస్థితులలోనూ సస్యమిత్ర గ్రూపులోని సభ్యులు పంచుకొనుటకు అవకాశము లేదు. ఒకవేళ గ్రూపులోని సభ్యులు వారు చేసిన పొదుపులు పంచుకొనే పరిస్థితి ఏర్పడితే ఈ ప్రాజెక్టు క్రింద ఎకాలజీ సంటరు ఇచ్చిన మొత్తాన్ని తిరిగి ఎకాలజీ సెంటరు నిర్దేశించిన ఇతర గ్రూపులకు చెల్లించవలసి ఉంటుంది.

ఈ కార్యక్రమము క్రింద ఒక్కొక్క మహిళ లబ్దిదారు ఎంచుకొన్న ఆదాయ కార్యక్రమానికి అవసరమైన పెట్టుబడి రూ. 12,000 నుండి 17,000 వరకు వుండునట్లు భావించడమైనది. అందులో వారి వాటా కనీసం 25 శాతం వుండవలయును. ఒకవేళ అంతకంటే ఎక్కువ మొత్తము అవసరమైనపుడు ఆ అదనపు మొత్తాన్ని లబ్దిదారులే సమకూర్చుకొనవలయను. ఆ విధంగా వారు అదనపు మొత్తాన్ని సమకూర్చుకొన్న తరువాతనే ప్రాజెక్టు నుండి ధన సహాయాన్ని మరియు సస్యమిత్ర గ్రూపు నుండి అప్పు విడుదల చేయబడుతుంది. ఆర్థిక సహాయం మంజూరు చేయుటకు క్రింది అంశాలను పరిగణించడం జరుగుతుంది.

1. ఒక మహిళ ఎంచుకొన్న అదనపు ఆదాయ కార్యక్రమం ద్వారా రోజుకు కనీసం రెండు వందల ఆదాయము రావాలి. ఒక మహిళ ఎంచుకొన్న అదనపు ఆదాయ కార్యక్రమానికి అవసరమయ్యే పెట్టుబడి, ఆ కార్యక్రమానికి అయ్యే ఆదాయ వ్యయాలు, నికర లాభాలు మొదలగు వివరాలతో ఒక సింపుల్ ఆర్థిక ప్రణాళికను మహిళతో చర్చించి యస్.టి.ఓ. తయారు చేయవలయును. దానితో పాటు ఆ కార్యక్రమానికి అవసరమైన నైపుణ్యము, అనుభవము ఎంపిక చేసిన మహిళకు ఉ న్నాయా? ఆ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇంటిలోని వారు సహకారము ఇవ్వడానికి సిద్దంగా వున్నారా మొదలగు అంశాలను కూడా కుటుంబముతో చర్చించి ప్రణాళికలో వివరించవలయును.

2. పై విధముగా ప్రణాళిక చేయడానికి ఒక సింపుల్ ఫార్మాటు తయారుచేసి ఇవ్వడం జరుగుతుంది. దానిని పూర్తిగా సంబంధిత మహిళతో, అవసరమైతే కుటుంబ సభ్యులతో చర్చించి వారి ఆలోచన, అంచాల మేరకు ప్రణాళికను యస్.టి.ఓ.తయారు చేయవలయును. ఆ విధంగా తయారు చేసిన ప్రణాళికను సస్యమిత్ర గ్రూపుకు సమర్పించి తగిన విధంగా నిర్ణయము తీసుకొనునట్లు ఫెసిలిటేట్ చేయవలయును.

3. యస్.యం.జి. ద్వారా ఎంపిక కాబడిన మహిళా సభ్యురాలికి అవసరమయ్యే పెట్టుబడి మొత్తములో సొంత పెట్టుబడి కనీసం 25% వుండాలి. మిగిలిన పెట్టుబడిలో 50% అంటే రూ. 5000/- నుండి రూ. 7500/- వరకు ఆర్థిక సహాయము మంజూరు చేయుటకు ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరుకు అవకాశము కలదు. అయితే ఈ మొత్తమును లబ్దిదారులు తప్పనిసరిగా వారి సస్యమిత్ర గ్రూపులకు సస్యమిత్ర గ్రూపు నిర్ణయించిన కంతుల ప్రకారము తిరిగి చెల్లించవలసి వుంటుంది.

4. యస్.యం.జి. గ్రూపు పెట్టుబడికి అవసరమైన మిగిలిన 50% అప్పు వారి సస్యమిత్ర గ్రూపు మంజూరు చేయాలి. ఆ విధంగా ప్రాజెక్టు నుండి 50% సహకారం (ఉదా: ఎస్.ఎం.జి. నుండి 5000/- + ప్రాజెక్టు నుండి 5000/- మొత్తము=10000/-, ఎస్.ఎం.జి. నుండి 7500/-+ప్రాజెక్టు నుండి 7500/- మొత్తము = 15000/-) పొందడానికి యస్.యం.జి. తీర్మానం చేసి, వారి ప్రతిపాదనను వారి యం.టి.యల్ ద్వారా జీవనోపాధుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌కు పంపవలెను.

## 3.5 ఈ కార్యక్రమములో గ్రామ సస్యమిత్ర సమాఖ్య పాత్ర :

ఒక గ్రామములో సాధారణంగా నాలుగు సస్యమిత్ర గ్రూపులు వుంటాయి. ఈ నాలుగు కలిపి ఆ గ్రామ సస్యమిత్ర సమాఖ్యగా ఏర్పడతాయి. సస్యమిత్ర గ్రూపుల యొక్క కన్వీనర్లు, కో కన్వీనర్లు గ్రామ సస్యమిత్ర సమాఖ్యలో సభ్యులుగా వుంటారు. (అన్ని స్థాయి గ్రూపులలోనూ కన్వీనరు తప్పనిసరిగా మహిళలే వుంటారు)

**ఈ కార్యక్రమములో గ్రామ సస్యమిత్ర సమాఖ్య పాత్ర :**

1. ఈ కార్యక్రమము క్రింద సస్యమిత్ర గ్రూపులకు వచ్చే ఆర్థిక సహాయాన్ని వారి గ్రామంలోని అన్ని గ్రూపులు సద్వినియోగం చేసుకొనే విధంగా ప్రోత్సహించ వలయును.
2. ఈ కార్యక్రమము అమలు కోసం నిర్దేశించిన మార్గ దర్శకాలను, నియమ నిబంధనలు అన్ని గ్రూపులు పాటించునట్లు చూడవలయును.
3. అర్హులైన మహిళలను మాత్రమే ఎంపిక చేయునట్లు ప్రోత్సహించవలయును.
4. సస్యమిత్ర గ్రూపులు వారి రివాల్వింగు ఫండు నిర్వహణలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకొనే విధంగా ప్రోత్సహించవలయును.
5. ఏదైనా సస్యమిత్ర గ్రూపులో సమస్యలు లేదా భేదాభిప్రాయాలు వచ్చినపుడు వారితో సామరస్యంగా చర్చించి, ఏకాభిప్రాయం సాధించి పరిష్కరించుకొనునట్లు మధ్యవర్తిత్వము చేయవలయును.
6. గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు వారు అదనపు ఆదాయ కార్యక్రమాలను అమలు చేసుకొనుటకు అవసరమైన సహాయ సహకారమును అందించవలయును.

## 4. ఏ రకమైన అదనపు జీవనోపాధులకు ప్రోత్సాహం లభిస్తుంది :

ఈ కార్యక్రమం క్రింద చట్టబద్ధమైన, నైతికమైన ఎలాంటి జీవనోపాధుల

కార్యక్రమానికైనా ఆర్థిక సహాయం అందించవచ్చు. వాటిలో కొన్నింటిని క్రింద ఉద హరిచండమైనది. 1. చిల్లర అంగడి 2. కూరగాయల వ్యాపారం 3. టెంకాయల వ్యాపారం 4. చీరలు, ఫాల్స్, లైనింగ్ క్లాత్ వ్యాపారం 5. గాజుల వ్యాపారం 6. చిన్న ఫ్యాన్సీ స్టోర్ 7. పండ్ల వ్యాపారం 8. గ్రామస్థాయిలో హోటల్ 9. సిల్వర్, స్టీల్ సామాన్ల వ్యాపారం 10. బొరుగుల వ్యాపారం, 11. సేమియా వ్యాపారం 12. పొట్టేల పెంపకం 13. పాల వ్యాపారం 14. చిరుధాన్యాల వంటకాలు, బేకరి షాపులు 15. టైలరింగ్/గార్మెంట్ దుస్తులు తయారీ చేసి అమ్మడం 16. కంబళ్ళు తయారీ, అమ్మకం 17. మగ్గాలు పట్టు, చేనేత దుస్తుల తయారీ 18. పాడి పశువులు 19. వ్యవసాయ సాంకేతిక సేవలు 20. వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి చేయడం అమ్మకం మొదలగునవి.

ఇవే కాకుండా ఇతర కార్యక్రమాలను కూడా మహిళలు ప్రతిపాదించవచ్చు.

**5. వసూలు మరియు పునర్వినియోగము :**

1. ఏ.ఎఫ్. సంస్థ నుండి లబ్దిదారులకు ఇచ్చిన ఆర్థిక సహాయము ఆయా సస్యమిత్ర గ్రూపులకు రివాల్వింగు ఫండుగా ఉపయోగించుకొనుటకు కొన్ని షరతులకు లోబడి అవకాశము కల్పించడమైనది. కాబట్టి యస్.యం. జి. విధి విధానాల ప్రకారం లబ్దిదారుల నుండి అసలు + వడ్డీ నిర్ణయించిన కంతుల ప్రకారం వసూలు చేయాలి. తద్వారా వారి రివాల్వింగు ఫండు పెరుగుతుంది.
2. గ్రూపులలో వసూలు అయిన అప్పు అసలు + వడ్డీల మొత్తాలను ఎస్.ఎం.జి. పొదుపులలో కలుపుకోవలెను అప్పుల వసూల్లు, నెలవారి పొదుపులు, వసూలైన వడ్డీ అపరాధ రుసుము అన్నీ కలిపి సస్యమిత్ర గ్రూపు స్థాయిలో రివాల్వింగు ఫండుగా సభ్యుల ఆర్థిక, సాంఘిక అభివృద్ధి కోసం నిర్వహించుకొనవలెను.
3. ప్రతినెల ఈ రివాల్వింగు ఫండు నుండి అర్హత గల మహిళలకు అదనపు జీవనోపాదుల అభివృద్ధి కోసం అప్పులు సమకూరుస్తూ, రివాల్వింగు చేయవలయును. ఈ రివాల్వింగ్ ఫండ్‌ను సక్రమంగా నిర్వహించుటలో గ్రూపు కన్వీనర్, కో.కన్వీనర్ మరియు ఉప గ్రూపు ప్రతినిధులు బాధ్యత తీసుకునేలా యస్.టి.ఓ.లు ఫెసిలిటేట్ చేయవలెను.
4. తద్వారా గ్రూపులోని రివాల్వింగు ఫండు మొత్తము పెరుగుతూపోతుంది. తద్వారా ఇంకాఎక్కువ మంది మహిళాసభ్యులకు రాబోయే కాలములో అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడానికి వీలవుతుంది. గ్రూపు యొక్క ఆర్థిక స్థితితో పాటు, మహిళల సామర్థ్యాలు, వారి గౌరవము కూడా పెరుగుతూ పోతుంది.

ఆర్థిక ఆదాయ పెరుగుదలతో ఉత్సాహంగా ఉన్న మహిళలు గ్రూపు సమావేశాలలో, సంస్థ చేపట్టిన అన్ని కార్యక్రమాలు అమలు చేయడంలో ఇంకా ఉత్సాహంగా పాల్గొంటారు. వారి నాయకత్వంలో గ్రూపులు ఇంకా అనేక ఇతర సాంఘిక కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఆ విధంగా గ్రూపులు ఇంకా బలోపేతం అవుతాయి.

5. తద్వారా మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించి ఆత్మవిశ్వాసంతో మెలుగుతారు. కుటుంబంలో, గ్రూపు సభ్యుల మధ్య, సమాజంలో గుర్తింపు, గౌరవం పొందుతారు.

**6. గ్రూపు స్థాయిలో రికార్డుల నిర్వహణ :**

1. ప్రస్తుతం సస్యమిత్ర గ్రూపులు నిర్వహించుకుంటున్న పొదుపు, మినిట్, రికార్డులతో పాటు ప్రత్యేక మైన రికార్డును ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సస్యమిత్ర గ్రూపు స్థాయిలో నిర్వహించాలి. అందుకు యస్.టి.ఓ. మరియు బుక్ కీపరు బాధ్యత తీసుకోవలయును.
2. రికార్డుల నిర్వహణ వలన ఇప్పటి వరకు గ్రూపుకు వున్న మొత్తం పొదుపుతో పాటు, తీసుకొన్న ఆర్థిక సహకార లావాదేవీల వివరాలు పూర్తిగా తెలిసేలా వుండాలి. గ్రూపు నిర్ణయాలలో పారదర్శకత, ఆర్థిక పారదర్శకతలో భాగంగా రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించవలెను.

**7. ప్రాజెక్టు నిర్వహణ అవగాహనకై శిక్షణలు :**

1. ప్రాజెక్ట్ క్షేత్ర స్థాయిలో అమలు చేయబోయే యస్.టి.ఓ., యం.టి.యల్‌కు, పి.ఎమ్.ఈ సిబ్బందికి ఈ ప్రాజెక్టు ఆశయము, ఉద్దేశాలు, విధివిధానాలపై పూర్తిగా అవగాహన కల్పించడం జరుగుతుంది.
2. ఈ ప్రాజెక్టు గురించి అన్ని సస్యమిత్ర గ్రూపులకు మరియు జి.యస్.యం.యస్. సభ్యులకు పూర్తిగా అవగాహన కల్పించడం జరుగుతుంది.
3. కార్యకర్తలకు బుక్ కీపర్లకు, గ్రూపు కన్వీనర్, కో.కన్వీనర్‌కు ఈ ప్రాజెక్టు రికార్డు నిర్వహణపై అవగాహన కల్పించడం జరుగుతుంది.

**8. ఈ కార్యక్రమం అమలు చేయుటలో వివిధ స్థాయిలలోని సిబ్బంది పాత్ర :**

ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించుటకు అన్ని స్థాయిలలో మన సిబ్బంది సమర్థవంతంగా వారి వారి పాత్ర పోషించవలసి వుంటుంది. సంస్థ స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయటకు ప్రాజెక్టు కో ఆర్డినేటరుగా శ్రీమతి హకీమ్ రిజ్వానా

గారిని నియమించడం జరిగింది. మన SADL ప్రాజెక్టులో పని చేసే సిబ్బంది అందరు, అన్ని స్థాయిలలో ఈ కార్యక్రమం అమలు చేయుటకు నిర్దేశించడమైనది. ముఖ్యంగా STO లు, MTL లు, PME టీము, ప్రాజెక్టు కో ఆర్డినేటరు యొక్క పాత్రలను కింద సూచించడమైనది. ఈ కార్యక్రమము అమలు చేసే ప్రక్రియలో, పరిస్థితులను బట్టి వారి పాత్రలలో అవసరమైన మార్పులు చేర్పులు చేయడం జరుగుతుంది.

## 8.1 ప్రాజెక్టు అమలులో భాగంగా యస్.టి.ఓ. పాత్ర :

ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి యస్.టి.ఓ.లు సస్యమిత్ర గ్రూపు స్థాయిలో కీలకమైన పాత్ర పోషించవలసి ఉంది. వారు ఈ కార్యక్రమానికి సంబంధించి తమ యం.టి.ఎల్.కు మరియు అదనపు జీవనోపాధుల ప్రాజెక్టు కో ఆర్డినేటరుకు ఇద్దరికీ జవాబుదారీగా వుంటారు.

1. మొదట ఈ కార్యక్రమము యొక్క ఆశయాన్ని, ఉద్దేశాలను, అమలు చేయు పద్ధతులను అన్ని సస్యమిత్ర గ్రూపులలో చర్చించి, వారికి అర్థమయ్యే విధంగా వివరించవలయును. గ్రూపులలో శ్రద్ధాసక్తులను కల్పించి గ్రూపును సిద్ధం చేయవలయును.
2. ఒక ప్రక్క A గ్రేడు గ్రూపులలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుండగా అదే సమయంలో BCD గ్రేడులలో ఉన్న గ్రూపులలో ఈ కార్యక్రమం గురించి వారితో చర్చించి, దీని వలన వారికి కలిగే ప్రయోజనాలను వివరించి, వాటిని A గ్రేడులోనికి తీసుకొన రావడానికి తగిన చర్యలు చేపట్టవలయును.
3. యస్.టి.ఓ.లు సంస్థ నిర్దేశించిన అర్హత, ప్రాధాన్యతల ఆధారంగా పద్ధతి ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసే విధంగా సస్యమిత్ర గ్రూపులను ఫెసిలిటేట్ చేయవలయును.
4. అదనపు ఆదాయ కార్యక్రమాలకు ఎంపిక కాబడిన మహిళల కోసం వారి సహకారంతో, ఆర్థిక సహకార దరఖాస్తును యస్.టి.ఓ. పూర్తి చేయాలి. ఈ పూర్తి చేసిన దరఖాస్తును మరియు ఎస్.ఎం.జి. తీర్మానాలను తన సిఫార్సులతో యం.టి.యల్‌కు అందజేయాలి.
5. యస్.యం.జి. మరియు ప్రాజెక్టు విధివిధానాల ప్రకారం జీవనోపాధుల కార్యక్రమాలు అమలు జరుగునట్లు ఫెసిలిటేట్ చేయవలెను. అదే విధంగా అప్పు కంతు సక్రమంగా తిరిగి చెల్లించునట్లు ఎప్పటికప్పుడు యస్.టి.ఓ. ఫెసిలిటేట్ చేయాలి.

6. బుక్‌కీపర్ల ఆధ్వర్యంలో రికార్డులు సక్రమంగా నిర్వహించేలా యస్.టి.ఓ. ఫెసిలిటేట్ చేయాలి. ప్రతి నెల రికార్డులను పరిశీలించవలయును.

7. లబ్దిదారులు నిర్వహించుకుంటున్న అదనపు ఆదాయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఏవైనా కారణాలతో కార్యక్రమాలు కుంటుపడితే తగిన సహకారము అందించి సక్రమంగా అమలుజరుగునట్లు చూడవలెను. అందుకు అవసరమైతే ఎప్పటికప్పుడు పై అధికారుల మరియు సంబంధిత ఇతరుల సహకారం కూడా తీసుకొనవలెను.

8. ఈ ప్రాజెక్ట్ అమలులో క్షేత్రస్థాయిలో లబ్దిదారులు లేదా గ్రూపులు ఎదుర్కొంటున్న సవాళ్ళను సమస్యలను ఏప్పటికప్పుడు యం.టి.యల్‌తో చర్చించి పరిష్కరించుకొనవలెను.

9. ఈ ప్రాజెక్ట్ అమలు వలన లబ్ధిపొందిన మహిళ విజయగాథలను ఎప్పటికప్పుడు వ్రాసి యం.టి.యల్ ద్వారా జీవనోపాధుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌కు అందజేయాలి.

10. తన పరిధిలోని సస్యమిత్ర గ్రూపులకు సంబంధించి ఈ కార్యక్రమము అమలవుతున్న తీరును పురోగతి నివేదికలను నిర్దేశించిన విధంగా తమ యం.టి.ఎల్ ద్వారా పి.యం.ఇ. మరియు ప్రాజెక్టు కో ఆర్డినేటరుకు పంపవలెను.

## 8.2 ప్రాజెక్ట్ అమలులో భాగంగా యం.టి.యల్ పాత్ర :

తమ మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతముగా అమలు చేయుటలో ఎం.టి.ఎల్ కీలకమైన పాత్ర పోషించవలసి ఉంటుంది. మండల టీముకు సారధ్యము వహించి ఈ మార్గదర్శకాలకనుగుణంగా కార్యక్రమాన్ని అమలు చేయుటకు యం.టి.ఎల్. పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది.

ఈ ప్రాజెక్ట్ అమలుకు సంబంధించి యం.టి.ఎల్స్ అదనపు జీవనోపాధుల కో – ఆర్డినేటరుకు మరియు చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌కు జవాబుదారిగా వుంటారు.

1. ఈ కార్యక్రమాన్ని అన్ని సస్యమిత్ర గ్రూపులకు తెలియచేసి అమలు చేయుటకు యం.టి.ఎల్ తన యస్.టి.ఓ.లతో ఒక ప్రణాళిక తయారుచేసి అమలు చేయవలయును. మొదట A గ్రేడ్ గ్రూపులతో మొదలు పెట్టి బలహీనంగా వున్న BCD గ్రూపులను A గ్రేడు స్థాయికి తీసుకొని రావడానికి తన యస్.టి.ఓ.లతో ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకారము గ్రూపులను ఫెసిలిటేట్ చేయవయును.

2. ప్రతి నెల గ్రూపుల బలోపేతం దిశగా పురోగతిని యస్.టి.ఓలతో చర్చించి, సమస్యలున్న గ్రామాలను సందర్శించి పరిష్కరించవలయును. అందుకు అవసరమైతే జి.ఎస్.ఏమ్.ఎస్ లు మరియు యమ్.ఎస్.యం.ఎస్.ల సహకారం తీసుకోవలెను.

3. యస్.టి.ఓ. ఇచ్చిన జీవనోపాధుల కార్యక్రమాల దరఖాస్తులను యం.టి.యల్. ఆయా సస్యమిత్ర గ్రూపును సందర్శించి, వారితోనూ, ఎంపికైన లబ్ధిదారుతోనూ చర్చించి, సక్రమంగా వున్న యెడల తన సిఫార్సులతో జీవనోపాధుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్‌కు అందజేయవలెను.

4. ప్రతి నెల యస్.టి.ఓ.ల సమావేశాలలో ఈ కార్యక్రమ అమలు తీరును సమీక్షించవలయును. రివాల్వింగు ఫండు సక్రమంగా అదనపు జీవనోపాధుల కోసం మహిళలకు ఉపయోగపడునట్లు చూడవలెను.

5. యం.టి.యల్ మండల సస్యమిత్ర సమాఖ్యలో ఈ ప్రాజెక్ట్ ప్రగతిని సమీక్షించాలి. ఈ కార్యక్రమం వారి వారి గ్రామాలలో సక్రమంగా అమలు అయ్యేటట్లు వారిని ప్రోత్సహించవలెను. ఏ సస్యమిత్ర గ్రూపులోనైనా సమస్యలు వస్తే అవసరమైనపుడు మండల సమాఖ్యలు ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయవలయును.

6. క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుంటూ పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఎప్పటికప్పుడు జీవనోపాధుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ తో సమస్యను చర్చించి పరిష్కరించవలెను.

7. ఈ ప్రాజెక్టు పురోగతిని నిర్దేశించిన ఫార్మాట్లలో ప్రతి నెల పి.యమ్.ఈ కి పంపవలయును. మరియు సమీక్ష సమావేశాలలో రిపోర్టు చేయవలయును.

**8.3 ప్రాజెక్ట్ అమలు పర్యవేక్షణలో పి.యం.ఈ. విభాగం విధులు :**

1. పి.యం.ఈ. విభాగం ఈ ప్రాజెక్టు అమలు చేయటకు అవసరమైన ప్లానింగ్, మానిటరింగు, రిపోర్టు ఫార్మాట్లను మరియు గ్రామ స్థాయిలో నిర్వహించవలసిన ఫార్మేట్‌లను తయారుచేయాలి.

2. ఫీల్డ్ విజిట్‌లో తప్పక ఈ ప్రాజెక్ట్ అమలు భాగంగా మహిళా గ్రూపు సభ్యుల ఎంపిక, అమలు విధానం ఎలా వున్నది పరిశీలించాలి. కార్యక్రమ అమలు ప్రక్రియ విధివిధానాల ప్రకారం వుండేలా మండల టీమ్‌లకు సూచనలు చేయాలి.

3. పి.యం.ఈ. దినసరి రిపోర్టు ద్వారా ఈ ప్రాజెక్ట్ పర్యవేక్షణ రిపోర్టును ప్రాజెక్ట్ కో-ఆర్డినేటరుకు పి.ఎమ్.ఈ. టీము లీడరుకు ఎమ్.టి.ఎల్‌కు మరియు ఎస్.టి.ఓ.కు అందజేయవలయును.

4. నెల వారీ సిబ్బంది సమీక్ష సమావేశంలో ప్రాజెక్ట్ ప్రగతిని రిపోర్టు చేయాలి.

5. ఈ కార్యక్రమానికి సంబంధించిన యం.ఐ.యస్. నిర్వహించాలి. నెలకొకసారి యం.ఐ.యస్. రిపోర్టును డైరెక్టరుకు, ఛీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌కు, ప్రాజెక్టు కో ఆర్డినేటరకు మరియు ఫైనాన్స్ మేనేజరుకు అందజేయవలయును.

## 8.4 అదనపు జీవనోపాధుల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విధులు :

సంస్థ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతముగా అమలు చేయు బాధ్యత ఈ ప్రాజెక్టు కో ఆర్డినేటరు పైన వుంటుంది. ఈ ప్రాజెక్టులో కనపరచిన ఉద్దేశములన్నింటినీ సాధించే దిశగా ఈ కార్యక్రమాన్ని నడిపించే బాధ్యత ప్రాజెక్టు కో ఆర్డినేటరు పై ఉంటుంది.

ఈ ప్రాజెక్టు అమలులో అదనపు జీవనోపాధుల కో–ఆర్డినేటరు ఛీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ గారికి మరియు డైరెక్టరు గారికి జవాబు దారీగా ఉంటారు.

1. సంస్థ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, లక్ష్యాలను సాధించే బాధ్యత అదనపు జీవనోపాధుల కో ఆర్డినేటరు వహిస్తారు.
2. మార్గదర్శకాలు మరియు విధి విధానాల ప్రకారం ఈ ప్రాజెక్టు అమలయ్యేలాగా యం.టి.యల్. లకు నాయకత్వం వహించి, వారి ద్వారా ఎస్.టి.ఓ.లను ఫెసిలిటేట్ చేయాలి.
3. నెల వారీ సిబ్బంది సమీక్ష సమావేశంలో ప్రాజెక్ట్ ప్రగతిని సమీక్షించి, ఏమైనా సమస్యలు వుంటే వాటిని పరిష్కరించాలి.
4. ప్రతి నెల ప్రాజెక్ట్ ప్రగతి రిపోర్టును డైరెక్టరు గారికి ఛీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ గారికి పంపించవలయును,
5. 6 నెలలకొకసారి సెంట్రల్ మానిటరింగ్ నిర్వహించి, మూల్యాంకనము చేయవలయును. తద్వారా క్షేత్ర స్థాయి పరిస్థితులను అర్థం చేసుకుంటూ ప్రాజెక్ట్ అమలులో ఉద్దేశ్యాలు సాధించే విధంగా ముందుకు వెళ్ళడానికి చర్యలు చేపట్టాలి.
6. ప్రాజెక్టు అమలులో పురోగతిని, సమస్యలను, పరిష్కార మార్గాలను ఎప్పటికప్పుడు డైరెక్టరు మరియు ఛీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌తో చర్చించి వారిచ్చే సూచనలను పాటించవలయును.

**డా॥ వై.వి. మల్లారెడ్డి**
డైరెక్టరు
ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు,
అనంతపురము.

ACCION FRATERNA

ecology centre

sustainable . human . nature

# ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటరు


ఉప్పరపల్లి రోడ్డు, బెంగళూరు హైవే

అనంతపురము – 515 002, ఆంధ్రప్రదేశ్

Tel: +91 (O) 8554 - 244 222, 246 884    Fax G +91 (O) 8554 - 24490

Email: mallareddy@accionfraterna.org; yvmallareddy@yahoo.co.in

www.af-ecologycentre.org